
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



కోదండ రామాలయ వార్షికోత్సవం

నూజెండ్ల: మండలంలోని ఐనవోలులో ఉన్న శ్రీకోదండ రామస్వామి దేవాలయ 9వ వార్షికోత్సవం గురువారం జరిగింది. ఆలయ ధర్మకర్త బుల్లయ్యనాయుడు దంపతులు పూజలు చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1818 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 138 క్యూసెక్కులు వదిలారు.

చెన్నకేశవస్వామి రథోత్సవం



తెనాలి టౌన్: మండలంలోని కొలకలూరు గ్రామంలోని కేశవ రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

'వెలుగు విజన్'పై దృష్టి సారించండి



చీరాల టౌన్: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విజన్ బిల్డింగ్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ సూచించారు. మండలంలోని బుర్లవారిపాలెం వెలుగు కార్యాలయంలో గురువారం పొదుపు మహిళా గ్రూపు లీడర్లకు విజన్ బిల్డింగ్‌పై అవగాహన సదస్సును ఏపీఎం మధుసూదనరావు అధ్యక్షతన నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. తీసుకున్న రుణాలతో పొదుపు మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకుని ఆర్థికంగా వృద్ధిలోకి రావాలని చెప్పారు. పొదుపు మహిళల ఆర్థిక స్థితిగతులను మార్చే విజన్ బిల్డింగ్‌పై లీడర్లు అవగాహన పెంపొందించుకుని, సభ్యుల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు. చీరాల డివిజన్‌లో ఈనెల 15 వరకు శిక్షణ అందిస్తున్నామని పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంలు సుబ్బారావు, శ్రీనివాసరావు, మండల సమాఖ్య ప్రతినిధులు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు

యద్దనపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన పలు శాఖల అధికారులకు మెమోలు జారీ చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పులగం రజని అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించడం కోసం ముందుగా సమాచారం అందినప్పటికీ హాజరుకానీ మండలస్థాయి అధికారులకు సంజాయిషీ నోటీసులు పంపించామని పేర్కొన్నారు. మొత్తం ఏడు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరైనట్లు తెలిపారు. మూడురోజుల్లో సమాధానాన్ని తెలియజేయాలని, లేనిపక్షంలో తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.10.25 లక్షల విరాళం



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో పునర్నిర్మాణంలో ఉన్న చరిత్రాత్మక రెడ్డిపేరంటాలమ్మ ఆలయానికి గురువారం దాతలు భారీగా విరాళాలు అందించారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆలయానికి మార్చి 17న ఉదయం 10.30 గంటలకు ప్రతిష్టా కార్యక్రమం జరగనుంది. గుంటూరు చంద్రా వైద్యశాల డాక్టర్ నలబోతు శరత్‌చంద్ర రూ.7 లక్షలు, సాతులూరు గ్రామానికి చెందిన బండారుపల్లి మస్తాన్‌రావు, సత్యనారాయణ రూ.లక్ష, పాటిబండ్ల శివరామకృష్ణ, ప్రసాద్‌బాబు రూ.లక్ష, ఓట్ల మురళీకృష్ణ రూ.లక్ష, నడింపల్లి వీరయ్య రూ.25 వేలు చొప్పున ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మాహుతియత్నం

చికిత్స పొందుతూ మృతి

నాదెండ్ల: మనస్తాపానికి గురైన పదో తరగతి విద్యార్థిని ఆత్మాహుతియత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... చందవరం గ్రామానికి చెందిన విద్యార్థిని (16) సాతులూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ నెల 5న తోటి స్నేహితులతో కలిసి కోటప్పకొండకు వెళ్లింది. సాయంత్రానికి స్కూలుకు వచ్చిన విద్యార్థినిని ఉపాధ్యాయులు ఎక్కడికి వెళ్లావని ప్రశ్నించారు. 6న తల్లిదండ్రులను తీసుకుని పాఠశాలకు రావాలని పేర్కొన్నారు. దీంతో మనస్తాపానికి గురై ఇంటికి వెళ్లిన ఆమె 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 540.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

'ప్రేమైక' జీవన సౌందర్యం

లవ్ కెమిస్ట్రీతో లైఫ్ హ్యాపీ

- ఎల్లలు గెలిచిన ప్రేమబంధం
- కులం, మతం, దేశాలు వేరైనా ఒక్కటవుతున్న జంటలు
- వివాహ బంధంతో అన్యోన్యంగా.. ఆదర్శంగా జీవనం

ప్రేమంటే రెండు అక్షరాల కలయికే గానీ రెండు మనస్సుల సంగమం.. ఆమెలో అతడు, అతడులో ఆమె మమేకమై ముడి వేసుకున్న బంధం.. ఆకాశం, భూమి కలిసే చోటు మనసుకు పరవశం.. రెండు హృదయాలు పెనవేసుకున్న బంధం అపురూపం.. సరిహద్దులు, ఎల్లలు చెరిపేసి అల్లుకున్న ప్రేమ బంధంతో జీవితంలో కొత్త ప్రయాణానికి నాంది.. తొలిచూపులు గుండెలో సవ్వడి రేపిన వేళ, మదిలో మధుర ఊహలు చెలరేగిన వేళ ప్రేమకు అనంత శక్తి వస్తుంది.. వలపులు పండిన వేళ.. తలపులు మధురానుభూతిని కలిగిస్తాయి.. రెండు దారుల ఒకటై.. ప్రేమ బంధం అనుబంధమై జీవన యాత్ర సాగిస్తుంది. వాలంటైన్ డే సందర్భంగా అల్లుకున్న ప్రేమ బంధాలపై ప్రత్యేక కథనం .....



ప్రేమ ఎంతో మధురం

సాక్షి ప్రతినిధి,బాపట్ల :ప్రేమ ఎంతో మధురమని, స్వచ్ఛమైన ప్రేమ ప్రేమికుల జీవిత గమనాన్ని సరైన దిశలో నడిపిస్తుందని ఐఏఎస్ అధికారి మాధవీలత, ప్రొఫెసర్ వెంకటరామ మునిరెడ్డి చెప్పారు. ఇద్దరిది ప్రేమ వివాహం. ప్రేమ ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలే తప్పా స్వార్థంతో ఉండకూడదంటారు వీరు. ప్రేమికులు భవిష్యత్తును సరైన మార్గంలో నడిపించుకోవాలనే ఆలోచనపై అవగాహన కలిగి ఉండాలంటారు. మంచి ఆలోచన, అవగాహన, సమన్వయం కలిగిన ప్రేమతో ప్రేమికులు వారి కుటుంబాలకు మంచి భవిష్యత్తు అందించవచ్చని మాధవీలత, వెంకట రామమునిరెడ్డి చెబుతున్నారు.

మనుష్యులు వేరైనా హృదయాలు ఒక్కటే...

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మలకాట్‌పల్లికి చెందిన మాధవీలత తల్లిదండ్రులు కేవీ కృష్ణారెడ్డి, రామలక్ష్మి బ్యాంకు ఉద్యోగులు. జిల్లాలోనే కాలేజీ చదువులు చదివిన మాధవీలత తర్వాత ఎస్వీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో1992 నుంచి 1996 వరకు బీఎస్సీ అగ్రికల్చర్ చదివారు. ఇదే సమయంలో ఇదే జిల్లాలోని సిద్ధవటం మండలం పాన్నోలు కొత్తపల్లెకు చెందిన వెంకటరామ మునిరెడ్డి సైతం మాధవీలతతో కలిసి బీఎస్సీ అగ్రికల్చర్‌తో పాటు పీహెచ్‌డీ చేశారు. క్లాస్‌మేట్స్‌గా ఉన్న ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఆరేళ్ల ప్రేమ చివరకు పెద్దలను ఒప్పించి 2000 సంవత్సరం ఫిబ్రవరి 24న ఇద్దరూ పెళ్లి పీటలు ఎక్కారు. ప్రేమ వారి జీవిత లక్ష్యాలకు ఏమాత్రం అడ్డంకిగా మారకపోగా చుక్కానీగా మారింది. భర్త వెంకట రామమునిరెడ్డి సపోర్ట్‌తో మాధవీలత చివరకు ఐఏఎస్ కాగలిగారు. పీహెచ్‌డీ అనంతరం అంతర్జాతీయ పరిశోధన సంస్థ ఇక్రిశాట్‌లో సైంటిస్ట్‌గా పనిచేశారు. 2007 గ్రూప్–1లో మహిళా టాపర్‌గా నిలిచారు. తర్వాత నంద్యాల, నెల్లూరులలో ఆర్డీఓగా పనిచేశారు. 2018లో ఐఏఎస్ పొందారు. జూన్ 2019లో కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి మన్ననలు పొందారు. అనంతరం ఆమె రెండేళ్లకు పైగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. వెంకటరామమునిరెడ్డి ప్రస్తుతం బాపట్ల అగ్రికల్చర్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. కుమారుడు కౌశిక్‌రెడ్డి ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదువుతుండగా కుమార్తె హర్షిత ఇంటర్ పూర్తిచేసి నీట్ కోసం సిద్ధమవుతున్నారు. భర్త సపోర్ట్‌తో తాను ఈ స్థాయికి ఎదిగానని మాధవీరెడ్డి గర్వంగా చెబుతారు.

ఈ ప్రేమకు వారధి ఐర్లాండ్



తెనాలికి చెందిన పేరుబోయిన అవినాష్, గ్రీస్ దేశానికి చెందిన క్రిస్టినా గతేడాది డిసెంబరు నెలలో మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. పట్టణ గంగానమ్మపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పేరుబోయిన ఆంజనేయులు–నాగజ్యోతి కుమారుడు అవినాష్. బీటెక్ చేశాక, ఐర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గ్రీస్ దేశ యువతి క్రిస్టినా కూడా అక్కడే సాఫ్ట్‌వేర్ కొలువులో ఉన్నారు. వీరి పరిచయం ప్రేమకు దారితీసింది. పెళ్లితో నూరేళ్ల కలిసి జీవించాలని నిర్ణయం తీసుకున్నారు. తమ మనోభావాన్ని తెలియజేస్తే పెద్దలూ సంతోషంగా అంగీకరించారు. ఫలితంగానే పెద్దలు నిశ్చయించిన సుముహూర్తానికి స్థానిక కల్యాణమండపంలో వీరి పెళ్లి వైభవంగా జరిగింది. క్రిస్టినా తల్లి లౌకియా మెరిస్సరటౌతోపాటు సోదరి కూడా హాజరయ్యారు.

పీహెచ్‌డీ కలిపింది ఇద్దరినీ..



తెనాలికి చెందిన సౌతాంప్టన్ యూనివర్శిటీ శాస్త్రవేత్త డాక్టర్ అరవింద మీరా జర్మనీలో పీహెచ్‌డీ చేస్తుండగా డాక్టర్ గేహార్డ్ క్లింగ్‌తో పరిచయమయ్యారు. ఇది ప్రేమగా మారింది. కొన్నేళ్ల క్రితం తెనాలిలో దైవసన్నిధిలో హిందూ సంప్రదాయబద్ధంగా జరిగిన వీరి వివాహానికి ఇరుపక్షాల తల్లిదండ్రులు, బంధువులు హాజరై ఆశీర్వదించారు. ప్రస్తుతం డాక్టర్ గేహార్డ్ క్లింగ్ బ్రిస్టల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ది వెస్ట్ ఆఫ్ ఇంగ్లండ్‌లో ప్రిన్సిపల్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఏటా దంపతులు తెనాలి వస్తుంటారు.

గోవాడ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ తుషార్ డూడి



దేవస్థానం ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

అమర్తలూరు(వేమూరు): మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న గోవాడ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానాన్ని గురువారం ఆయన సందర్శించారు. బందోబస్తు, పార్కింగ్ ప్రదేశాలు, భక్తుల క్యూలైన్ల ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనే గోవాడ బాలకోటేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెందిందని తెలిపారు. తిరునాళ్లకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. దేవస్థానం పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల సాయంతో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తిరునాళ్లకు దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దొంగతనాలను నివారించేందుకు మఫ్టీలో పోలీసులను నియమించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, చుండూరు సీఐ శ్రీనివాసరావు, అమర్తలూరు ఎస్‌ఐ జానకీవర్ధన్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి అశోక్‌బాబు పాల్గొన్నారు.

పోలీసులపై నమ్మకం లేదు



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో చర్చిస్తున్న పుల్లారావు బాధితులు

- సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులతో ఎంపీ లావు వ్యాఖ్య
- సాక్ష్యాలు సేకరించి ఉన్నతాధికారులకు ఇవ్వాలని సూచన

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా అంటేనే పోలీసులకు పనిష్మెంట్ అని.. అటువంటి వారు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తనను కలిసేందుకు వచ్చిన సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులను ఉద్దేశించి అన్నారు. గురువారం ఎంపీ క్యాంప్ కార్యాలయానికి చిట్‌ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు బాధితులు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుల తరపున టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నమ్మకంగా చీటీపాటలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని పుల్లారావు ఉడాయించారన్నారు. మొత్తం రూ.300 కోట్లకుపైగానే ఉంటుందని చెప్పారు. నాలుగు నెలలుగా సుమారు రూ.70 కోట్లు అప్పుల రూపంలో తీసుకున్నాడని, ఆ సొమ్ము అతని వద్దే ఉందన్నారు. ఆలస్యం అయితే డబ్బులు పక్కదారి పట్టే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పోలీసులను మేనేజ్ చేసినట్లుగా అనుమానాలు ఉన్నాయని పలువురు బాధితులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. పుల్లారావు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయటంలో, వారి ఆస్తులు సీజ్ చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు.

ఐజీతో మాట్లాడిన ఎంపీ

దీనిపై స్పందించిన ఎంపీ... పల్నాడు జిల్లా పోలీసులు అంటేనే పనిష్మెంట్‌పై వచ్చేవారని, వారు పనిచేస్తారని తాను అనుకోవటం లేదన్నారు. బాధితులే కేసుకు కావాల్సిన ఆధారాలు, రికార్డెడ్ ఎవిడెన్స్‌లు సేకరించి పోలీస్ ఉన్నతాధికారులకు అందజేయాలని పేర్కొన్నారు. అనంతరం ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీతో ఎంపీ ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల తరపున కమిటీగా ఏర్పడిన ఐదుగురు సభ్యులు కలిసి సమస్య వివరిస్తారని, అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో నాగోతు శౌరయ్య, యామిని రామారావు, న్యాయవాది ప్రతాప్, ఓర్సు గోవింద్, గుదే రామయ్య తదితరులు ఉన్నారు.

యాంత్రీకరణ దిశగా ఇటుక పరిశ్రమ

- కూలీల కొరతతో తయారీదారులు మొగ్గు
- యంత్రాలతో తగ్గుతున్న పెట్టుబడులు
- ఉత్పత్తి పెరుగుదల
- నాణ్యతా ప్రమాణాలతో ఇటుకల తయారీ



పోతార్లంక సమీపంలో భారీ యంత్రం సాయంతో పచ్చి ఇటుక తయారీ ప్రక్రియ

కొల్లూరు : ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన జిల్లాలోని కొల్లూరు ఇటుక పరిశ్రమ క్రమక్రమంగా ఆధునికీకరణను అందిపుచ్చుకుంటోంది. డిసెంబర్ నుంచి మే వరకు ఆరు నెలల పాటు కొనసాగే ఇటుక ఉత్పత్తి వల్ల ఈ ప్రాంతంలో ఏడాది పొడవునా రూ. వందల కోట్లలో వ్యాపార లావాదేవీలు జరుగుతాయి. కృష్ణా నదీ పరీవాహక లంక గ్రామాల్లో పుష్కలంగా మట్టి ఉండటంతో ఇటుక పరిశ్రమ ఈ ప్రాంతంలో విస్తరించడానికి బలమైన పునాది అయ్యింది. ప్రస్తుతం కొల్లూరు, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, దోనేపూడి, తోకలవారిపాలెం, తురకపాలెం, తిప్పలకట్ట, పోతార్లంక గ్రామాల పరిధిలో సుమారు రెండు వేలకు పైగా ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమ నెలకొని ఉంది. ఈ ప్రాంతంలో సుమారు 120 చిన్న, పెద్ద పరిశ్రమల ద్వారా సుమారు 30 కోట్ల ఇటుక ఉత్పత్తి జరుగుతోంది. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాలకు ఇటుక సరఫరా చేయడం ద్వారా ఏడాదికి సుమారు రూ. 140 కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి.

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఇటుక

ఇటుక ఉత్పత్తిలో రేట్లతో పాటు కూలీల కొరతను అధిగమించడానికి ఉత్పత్తిదారులు యాంత్రీకరణకు మొగ్గు చూపుతున్నారు. కూలీల స్థానంలో నూతన పరిజ్ఞానంతో యంత్రాలు వచ్చాయి. ఎండిన ఇటుకలను బట్టీలమీదకు చేర్చేందుకు క్రేన్లు వినియోగిస్తున్నారు. ఇటుకలను కాల్చడానికి అవసరమైన బొగ్గును ముక్కలుగా చేసుకునే వరకు పలు రకాల యంత్రాలు వినియోగంలోకి వచ్చాయి. ఇటుకలలో నాణ్యత పెరగడంతోపాటు, ఆకారం కూడా కొనుగోలుదారులను ఆకర్షించే విధంగా ఉంది. లక్ష ఇటుక తయారీకి కూలీ ఖర్చుల కింద ఉత్పత్తిదారులకు రూ. లక్షకు మించి ఖర్చులు అవుతుంది. అదే యంత్రాల వినియోగంతో రూ. 65 నుంచి రూ. 70 వేలు మాత్రమే అవుతుండటంతో తయారీదారులు మొగ్గు చూపుతున్నారు.



పచ్చి ఇటుక తయారీకి ట్రాక్టర్‌తో తొక్కించి కలియపెట్టే యత్నం

యంత్రాలతో నాణ్యమైన ఇటుక ఉత్పత్తి



యంత్రాలతో తక్కువ సమయంలో ఇటుకలను వేల సంఖ్యలో తయారు చేయడంతో పాటు నాణ్యత ఉంటోంది. కంటికి ఇంపుగా ఉంటుంది. పచ్చి ఇటుక ఆరుదల సమయం కూడా చాలా తక్కువ. వెంటనే బట్టీలలో వేసి కాల్చవచ్చు.

నెల్లూరి చంద్రశేఖరరావు, ఇటుక ఉత్పత్తిదారుడు, కొల్లూరు

తక్కువ ఖర్చుతోనే యంత్రాల తయారీ



ప్రస్తుతం సొంతంగా తయారు చేసిన యంత్రాలను వినియోగించి కొల్లూరు ప్రాంతంలో ఇటుకల తయారీ ప్రారంభించాం. దీనివల్ల లక్ష పచ్చి ఇటుక తయారీలో రూ. 40 వేలు వరకు ఖర్చు తగ్గుతోంది. సగం మంది కూలీలతోనే యంత్రాలను వినియోగించి పరిశ్రమను సమర్థంగా నడుపుకోవచ్చు.

–ఉప్పు కృష్ణమోహన్, యంత్రాల తయారీ దారుడు, కొల్లూరు.

పరిశ్రమల స్థాపన దిశగా ప్రోత్సహించాలి

జేసీ ప్రఖర్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

బాపట్ల: పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులను మరింత ప్రోత్సహించాలని జేసీ ప్రఖర్ జైన్ తెలిపారు. పరిశ్రమల ప్రోత్సాహక, అభివృద్ధిపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని గురువారం ఆయన అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పరిశ్రమల నుంచి ఉత్పత్తి అవుతున్న వస్తువులు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉద్యాన పంటలు, సేంద్రియ పద్ధతిలో ఉత్పత్తి చేస్తున్న తృణ, పప్పుధాన్యాల ఎగుమతికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. తద్వారా ఉత్పత్తిదారులకు ఎంతో ప్రోత్సాహం ఉంటుందని, ఉత్పత్తులు కూడా పెరుగుతాయని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని చెప్పారు. బాపట్ల జిల్లాలో పరిశ్రమల స్థాపనకు దిశగా కృషి చేయాలని తెలిపారు.

జిల్లాలో 189 దరఖాస్తులు

పీఎంఈజీపీ పథకం కింద జిల్లాలో 189 దరఖాస్తులు వచ్చాయని జేసీ తెలిపారు. అందులో 90 యూనిట్ల స్థాపనకు రూ.2.81కోట్లు మంజూరు చేశామని వివరించారు. పీఎం విశ్వకర్మ పథకం కింద 36,300 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 4,771 దరఖాస్తులను జిల్లా స్థాయి నుంచి అధికారికంగా ఆమోదిస్తూ ప్రభుత్వానికి నివేదించామని వెల్లడించారు. 400 యూనిట్లకు రూ.9.13 కోట్ల రాయితీ సొమ్ము విడుదల చేయాలని ఆమోదిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ప్రకటించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే ప్రక్రియ 68.87% జరగడంపై ఆరా తీశారు. జిల్లాలో 56,641 పరిశ్రమలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ప్రస్తుతం 36,744 పరిశ్రమల విద్యుత్ కనెక్షన్లను గుర్తించి జియోట్యాగ్ చేశామని, మిగిలినవి త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే త్వరగా పూర్తి చేయడానికి సచివాలయాలలోని ఎనర్జీ అసిస్టెంట్ల సేవలను తీసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు 75 ఎకరాల భూమిని గుర్తించే ప్రక్రియ చేపడతామని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం బి.శ్రీనివాసరావు, కమిటీలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యార్డుకు 300 పసుపు బస్తాలు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు 300 బస్తాలు వచ్చాయని యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఎటువంటి క్రయ విక్రయాలు జరగలేదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

డ్రైవర్ల అప్రమత్తతతోనే ఆర్టీసీ అభివృద్ధి

నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రప్రసాద్

బాపట్ల టౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో గురువారం 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ డ్రైవర్ల పైనే ఆధారపడి పని చేస్తోందని, వాహనాన్ని ఏకాగ్రతతో నడపాలని సూచించారు. ప్రమాద రహిత డ్రైవింగ్‌తోనే సంస్థ అభివృద్ధి చెందుతుందని, ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో ప్రమాద రహిత డ్రైవర్లకు సన్మానం చేశారు. కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి, సీఐ రాంబాబు, ఆర్టీసీ అధికారులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చీరాల–వేటపాలెం మధ్యలోగల జాండ్రపేట రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య మాట్లాడుతూ మృతుని శరీరంపై తెల్లని చొక్కా, స్కైబ్లూ జీన్స్ ప్యాంటు ఉన్నట్లు చెప్పారు. మృతుని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ పోలీసుల (9440627646)కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పాఠశాలలను నిర్వీర్యం చేయడం సరికాదు

- రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్
- జీవో ననంబర్ 117తో బడుగు, బలహీనవర్గాల పిల్లలు చదువుకు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న బడుగు శ్రీనివాస్

బాపట్ల టౌన్: జీవో నంబర్ 117 పేరుతో గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం నిర్వీర్యం చేయడం తగదని ఎస్టీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌జీవో హోంలో జిల్లాలోని ఎస్టీయూ సంఘం నాయకులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ మోడల్ ప్రాథమిక పాఠశాలల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన పిల్లలు చదువుతున్న ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను మోడల్ పాఠశాలలో విలీనం చేయడం సబబు కాదని పేర్కొన్నారు. పాఠశాల దూరం పెంచడం బడుగు, బలహీన వర్గాలను చదువులకు దూరం చేయటమేనని, దీనివల్ల డ్రాప్ ఔట్స్‌గా మారే అవకాశం ఉందని తెలిపారు. రవాణా భత్యం ఇస్తామని తల్లిదండ్రులను మభ్యపెట్టడం తగదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రస్తుత ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో గెలిపించారని, అందుకు విరుద్ధంగా నేటి ప్రభుత్వం వ్యవహరించడం సరైన విధానం కాదని ఖండించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పునరాలోచించుకొని గ్రామాల్లోని మోడల్ బేసిక్ ప్రైమరీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో ఉద్యమం చేసైనా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ పీవీ నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఉదయ శంకర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూరుబాషా సుభాని, ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు, గవిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల కోసం పోరుబాట



మాట్లాడుతున్న కె.రామకృష్ణ



పాల్గొన్న రాష్ట్ర స్థాయి ప్రతినిధులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ


అమరావతి: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై దశలవారీగా పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని ధరణికోట జె.బి. గార్డెన్స్‌లో నిర్వహించిన అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమితి ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అగ్రిగోల్డ్ సంస్థకు ఉన్న ఆస్తులతో పోల్చుకుంటే బాధితులకు చెల్లించాల్సిన మొత్తం పెద్ద లెక్కలోకి రాదన్నారు. దీనిపై త్వరలో ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అసోసియేషన్ రాష్ట్ర సమితి కార్యాచరణకు సహకారం అందిస్తామని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ అంశంలో పోరు బాటే సరైనదన్నారు. టీడీపీ -జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ప్రకారం బాధితులకు న్యాయం చేయాలన్నారు. తిరుపతిరావు మాట్లాడుతూ ఈ నెల 19, 20వ తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా 24వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో అందిస్తామన్నారు. విజయవాడ కేంద్రంగా మార్చి 5వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీక్ష చివరి రోజు భారీ ప్రదర్శన నిర్వహించి అవసరమైతే చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిస్తామని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, అధ్యక్షులు ఈవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లికార్జున్, కర్ణాటక అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గురుమూర్తి, ఒడిశా అసోసియేషన్ అధ్యక్షులు చంద్రరావు, తెలంగాణ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్ర నాయక్, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు శేష కుమార్ రెడ్డి, నారాయణప్ప, నాగలక్ష్మి, అంజనీదేవి, అరేలమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

రేపు ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఎంపిక పోటీలు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న సెలక్షన్స్ జరుగుతాయని ప్రెసిడెంట్ అండ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ కుమ్మర క్రాంతి కుమార్ గురువారం తెలిపారు. పేరేచర్ల గ్రౌండ్‌లో సీనియర్ బాలుర విభాగంలో ఎంపికలు జిల్లా సెక్రటరీ దుర్గా మోహన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు నల్లమల జోన్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొంటారని, ఆ తర్వాత నల్లమల జోన్ టీమ్ ఎంపిక చేస్తారని వివరించారు. ఎంపికైన వారు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగబోయే అనంతపురం జిల్లా, ఆర్డీటీ గ్రౌండ్‌లో మార్చి 20 నుండి 27 వరకు జరగబోయే ఏపీ సూపర్ లీగ్ మెన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 టోర్నీలో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫిబ్రవరి 15 మధ్యాహ్నం 2 గంటలకు కోచ్ బ్రహ్మం (7337585790) రిపోర్ట్ చేయాలన్నారు.

1,35,941 మిర్చి బస్తాలు విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,24,013 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,35,941 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,900 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,000 నుంచి రూ.11,700 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 57,175 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

ఆటోలో ఎక్కువ మందిని ఎక్కించుకోవద్దు



చిలకలూరిపేట: ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని జిల్లా రవాణా శాఖాధికారి సంజీవ్‌కుమార్ చెప్పారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రహదారి నియమాలపై అవగాహన కల్పిస్తూ గురువారం ఆటో ర్యాలీ నిర్వహించారు. ముందుగా పచ్చ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. పరిమితికి మించి ఎక్కించుకుంటే జరిమానా విధించి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ప్రయాణికులతో డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ప్రమాద బాధితులను ఆస్పత్రుల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ కేవీఎల్ రావు, ఆర్టీసీ డీఎం రాంబాబు, పట్టణ ఎస్‌ఐ రహంతుల్లా, ఆటో యూనియన్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ అండ్ ఏడీ సౌత్ జోన్ టోర్నీ చాంపియన్ కర్ణాటక



విజేత కర్నాటక జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న మాజీ ఎంపి గోకరాజు గంగరాజు

మంగళగిరి: నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన విజయవాడ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో ఇండియన్ ఆడిట్స్, అకౌంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ అండ్ ఏడీ సౌత్ జోన్ టోర్నమెంట్ టైటిల్‌ను కర్ణాటక జట్టు సొంతం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కేరళ, కర్ణాటక జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేపట్టిన కర్ణాటక జట్టు 20 ఓవర్లలో 190 పరుగులు చేసింది. కర్ణాటక బ్యాట్స్‌మెన్ అర్జున్ హొయాసాల 49 బంతులలో 10 ఫోర్లు, 5 సిక్స్‌లతో 99 రన్స్ చేసి ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ అయ్యాడు. శరత్ బీఆర్ 12 బంతులలో 31 పరుగులు చేశాడు. కేరళ బౌలర్లు అంకిత మిశ్రా 3, ఎస్.మిథున్ 2 వికెట్లు తీశారు.191 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కేరళ జట్టు 20 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. దీంతో కర్ణాటక జట్టు టైటిల్ అందుకుంది. మాజీ ఏసీఏ అసోషియేషన్ చైర్మన్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, నిర్వాహకులు శాంతిప్రియ, కె.భాస్కర్, రాకేష్ నాయక్, ఎన్.నిఖిల, లలితకుమార్ బహుమతులు ప్రదానం చేసి విజేతలను అభినందించారు.


కోటప్పకొండ తిరునాళ్లకు సన్నద్ధంగా ఉండాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కె.శ్రీనివాసరావు తదితరులు

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన జరుగనున్న కోటప్పకొండ తిరునాళ్లకు పోలీసు అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. తిరునాళ్ల ఏర్పాట్లను గురువారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. కొండ పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ ప్రాంతాలు, స్నానాల ఘాట్‌లు, ప్రభలు నిలిపే స్థలం, బస్టాండ్‌లను ఐజీ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికను రూపొందించుకోవాలని ఆదేశించారు. గతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తిన ప్రాంతాలను గుర్తించి ఇప్పుడు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రోడ్ల వెడల్పు, బ్రిడ్జి, కల్వర్టులకు మరమ్మతులు, రోడ్డు మార్గాల్లో ఇతర అవాంతరాలను తొలగించే పనులు పూర్తిచేయాలని తెలిపారు. ఆలయం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. ప్రభలు రాకపోకలు సాగించే సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగినంత మంది పోలీసు సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్, అదనపు ఎస్పీ(ఏఆర్) వి.సత్తిబాబు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ రెడ్డి, రూరల్ సీఐ పి.రామకృష్ణ, టూటౌన్ సీఐ హైమారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా పోలీసుల ప్రతిభ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈనెల 7–9 తేదీల్లో మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో జరిగిన 43వ ఏపీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా పోలీసులు 21 పతకాలు సాధించారు. ఇందులో 8 బంగారు పతకాలు ఉన్నాయి. విజేతలైన క్రీడాకారులు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మీట్ గురించి ఎస్పీకి వివరించారు. దీంతో ఎస్పీ ఆనందం వ్యక్తం చేశారు. విజేతలైన చేబ్రోలు పీఎస్ ఏఎస్‌ఐ మైల సాంబశివరావు, ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్, ఏఆర్ ఎస్‌ఐ ఆర్.చంద్రశేఖరరావు, ఏఆర్ హెచ్‌సీ ఎండీ.షాహిదుల్లా, ఏఆర్ పీసీలు బి.కృష్ణారావు, డి.కిరణ్‌కుమార్, ఫింగర్ ప్రింట్స్ పీసీ ఎం.లక్ష్మయ్య, పశ్చిమ ట్రాఫిక్ పీఎస్ పీసీ డి.తిరుమలరావును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తిరునాళ్లలో జోరుగా రికార్డింగ్ డ్యాన్స్‌లు

- ప్రేక్షకపాత్ర వహించిన పోలీసులు
- చిందులు వేసిన తెలుగు తమ్ముళ్లు



నగరం: మండలంలోని ధూళిపూడి శ్రీ తాళ్లమ్మ తిరునాళ్ల సందర్భంగా మంగళవారం రాత్రి దేవస్థాన ప్రాంగణంలో జోరుగా రికార్డింగ్ డ్యాన్సులు జరిగాయి. తిరునాళ్లకు వచ్చిన మహిళలు అసహనానికి గురయ్యారు. దేవస్థాన ప్రాంగణంలోనే పెద్ద స్టేజీ ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభ ఎదురుగా మ్యూజికల్ నైట్ పేరుతో రికార్డు డ్యాన్స్‌లను వేయడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన మహిళలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. డ్యాన్స్‌లు, చెవులు చిల్లులు పడే ధ్వనులతో ఆలయ ప్రాంగణం మారు మోగింది. పోలీసులు కూడా ప్రేక్షక పాత్ర వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. తెలుగు తమ్ముళ్లు స్టేజీలపై రెచ్చిపోయి డ్యాన్స్‌లు వేసి, నానా హంగామా సృష్టించారు. గతంలో ఎప్పుడైనా ఇలా డ్యాన్స్‌లు వేశారా.. టీడీపీ ప్రభుత్వంలో వేస్తున్నాం అంటూ స్టేజీపై టీడీపీ నాయకులు ప్రసంగాలు చేయడం కొసమెరుపు. తిరునాళ్ల సందర్భంగా కొలగానివారిపాలెంలోనూ సోమవారం రాత్రి జనసేన ఆధ్వర్యంలో రికార్డింగ్ డాన్స్‌లు జరిగాయి.

వైభవంగా బూరుగులమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో బూరుగులమ్మ అమ్మవారు

రేపల్లె రూరల్: మాఘ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో గల గ్రామదేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారి తిరునాళ్లను గురువారం రెండో రోజు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే అమ్మవారికి సహస్ర నామ కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి సద్ది నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో పద్మశాలీయ మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ పలువురిని ఆకట్టుకుంది. సాయంత్రం గుంటూరుకు చెందిన కృష్ణ మంజీర కూచిపూడి నృత్య కళా నిలయం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు.

సాయి మనోజ్ఞకు సీఎం బాబు, మంత్రి లోకేష్ అభినందన



సాయి మనోజ్ఞను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన భాష్యం రామకృష్ణ



సాయి మనోజ్ఞను అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్

గుంటూరు ఎడ్యుకేషన్ :జేఈఈ మెయిన్స్–2025 ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో టాపర్‌గా నిలిచిన సాయిమనోజ్ఞ రాష్ట్రానికే గర్వకారణమని సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నారు. జేఈఈ మెయిన్స్ సెషన్–1 ఫలితాల్లో 100 పర్సంటైల్‌తో టాపర్‌గా నిలిచిన గుంటూరు భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థిని గుత్తికొండ సాయి మనోజ్ఞను గురువారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు. సాయిమనోజ్ఞ 100 పర్సంటైల్ సాధించిన ఏకైక తెలుగు విద్యార్థినిగా రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిందని, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.నారా లోకేష్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి కఠోర శ్రమ ఒక్కటే మార్గమని సూచించారు. ఈ సందర్భంగా సాయిమనోజ్ఞ తల్లి పద్మజను లోకేష్ సత్కరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న సాయిమనోజ్ఞ తండ్రి కిషోర్ చౌదరితో కరిక్యులం ప్రక్షాళనపై చర్చించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ ఆందోళన



విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ మీటర్స్ రీడర్స్‌కు జనవరి నెల వేతనాలు చెల్లించాలని, విద్యుత్ సంస్థ నిర్దేశించిన అగ్రిమెంట్ ప్రకారం ఒక్కో బిల్లుకు రూ.3.62 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు టౌన్ మీటర్ రీడర్స్ గురువారం పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గుంటూరు టౌన్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గుంటూరు నగరంలో సుమారు 120 మంది విద్యుత్ మీటర్ రీడర్స్ గత 20ఏళ్లుగా సంస్థను నమ్ముకొని పనిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు చాలా మంది కాంట్రాక్టర్లు మారినా సంస్థ నిర్దేశించిన అగ్రిమెంట్ ప్రకారం జీతం తీసుకుంటున్నామని వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్ నెల వరకు ప్రతి విద్యుత్ బిల్లుకు రూ.3.62 చొప్పున జీతం చెల్లించారని, ఈ ఏడాది జనవరి నుంచి టీబీసీ ఇన్‌ఫ్రా ఏజెన్సీకి చెందిన బండ్ల బిక్షయ్య చౌదరికి కాంట్రాక్టు అప్పగించారని, ఇప్పుడు ఈ ఏజెన్సీ రూ.3.20 మాత్రమే చెల్లిస్తామని చెబుతోందని వివరించారు. ఇది తగదని పేర్కొన్నారు. ఒక్కో మీటరు బిల్లుకు రూ.3.62 చొప్పున జీతం ఇప్పించడంతో పాటు, పీఎఫ్, ఈఎస్‌ఐ కూడా సకాలంలో కట్టించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు టౌన్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు ఎ.సూర్యనారాయణ, దేవరపల్లి నాగేశ్వరరావు, షేక్ వలి, ముస్తఫా, స్టీఫెన్‌బాబు, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరమ్మ పేరంటాళ్లు తిరనాళ్ల



పూజలందుకుంటున్న వీరమ్మ పేరంటాళ్ళు అమ్మవారు



సిడిమాను ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

పెదకాకాని: వుయ్యూరు వీరమ్మ పేరంటాళ్ళు తిరునాళ్ళ గురువారం కనుల పండుగగా జరిగింది. పెదకాకాని ప్రధాన సెంటర్‌లోని పేరంటాళ్ళు అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఆరు రోజులుగా అమ్మవారు తిరునాళ్ల జరుగుతున్నాయి. బుధవారం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారు కొలువుదీరి గ్రామోత్సవానికి బయలుదేరారు. కొమ్ముల వాయిద్యాలు, కనక తప్పెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తక్కెళ్ళపాడు, అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాల్లో ఉత్సవం సాగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం విద్యుద్దీప కాంతులతో ధగధగలాడింది. ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు పర్యవేక్షించారు. పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి, సిబ్బంది ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బంగారు ఆభరణాల చోరీ



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్‌ఐ మాల్యాద్రి

పర్చూరు(చినగంజాం): ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు సొత్తు చోరీ చేసి ఉడాయించారు. ఎస్‌ఐ మాల్యాద్రి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పోతుకట్ల గ్రామంలో నివాసముంటున్న గండికోట బాజీ కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లారు. ఈ సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 10 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించారు. తాళాలు తీసుకొని దర్జాగా బీరువాను తెరచి ఆభరణాలు తీసుకెళ్లినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని చెప్పారు.